# నివురుగప్పిన నిప్పు

సంజీవయ్య అప్పుడప్పుడు కళ్లుతెరిచి అటూ ఇటూ చూస్తున్నాడు. ద్వార బంధం వేపుచూపు నిలుపుతున్నాడు. కాని-అంతలోకి మైకం కమ్మినట్టవుతోంది.

అతడి మంచానికి దగ్గరగా సంజీవయ్య పినతండ్రి కొడుకు సాంబయ్య, సంజీవయ్య చనిపోయిన భార్యతమ్ముడు వెంకటేశం కూర్చున్నారు. ఊరిపెద్దలూ పరిచయస్తులూ గోడకానుకుని కూర్చున్నారు.

ఆ ఊరిఆడవాళ్లందరూ ఒక్కొక్కరే వచ్చిచూసి 'ఎట్లా ఉంది' అని రహస్యంగా దగ్గరున్న వాళ్లనడిగి తెలుసుకుంటున్నారు. వీధివాకిట్లో రైతులు చెట్లక్రింద కూర్చుని గుసగుసలాడు కుంటున్నారు.

"ఈ సంజీవయ్యగారు ఈ ఊరొచ్చిన పదిహేనేళ్ళ కాలంలో ఊళ్లో ఎంత మార్పు వచ్చింది? ఊరెంత-బాగుచేశాడు? ఎదటివాడిఆకలిని తెలుసుకున్న వాడిలోనే దైవాంశఉంటుంది. వారానికొకసారి పేదలకు అన్నదానం విధిగా ఉండవలసిందే. ఈ సంజీవయ్యగారు పిలవకపోతే ఏ డాక్టరు ఈ ఊళ్లో నాలుగేసి రోజులుండి ప్రజారోగ్యాన్ని కనిపెట్టిచూస్తాడు నెలకొకసారివచ్చి? ఇదివరకూ ఈ ఊర్లో ఇన్ని బావులుఉన్నాయా? మహాత్ముడంటే ఈయనేనయ్యా? మరొక సంగతి-ఈయన పట్టించుకోకపోతే ఈ ఊళ్ళో వీధులు ఏర్పడేవా? సందులు ఇట్లా ఉండేవా?"

"ఆ మాటే నేననవస్తున్నా. వారానికొకసారి పేదలకు అన్నదానం ఎవరు చేశారు ఈ ఊళ్లో? సేట్లూ శ్రీమంతులూ ఇందరున్నారు. ఒక్కరైనా. ఒక్కసారైనా తలపెట్టారా? నాలో నేను ఊరికే ఆలోచిస్తూ ఉంటాను-ఈయనకు ఇంత డబ్బు ఎక్కడిదని. ఊరివెంట పిల్లకాకుల్లా తిరిగే పిల్లలను పోగుచేసి చదువులు చెప్పిస్తున్నాడు. ఉపకార వేతనాలిప్పిస్తున్నాడు. ఈయనకు ఈ పనులన్నిటికీ ఎంత పలుకుబడి ఉండాలి? ఈ దానధర్మాలకన్నిటికీ ఎంత డబ్బు ఉండాలి?"

గదిలో గోడకానుకుని కూర్చున్నవాళ్లు ఆయన వితరణ బుద్ధికి ఆశ్చర్య పడిపోతున్నారు.

మంచం దగ్గరగా కూర్చున్న పినతండ్రికొడుకు సాంబయ్యవి-జ్ఞాతి ఆలోచనలు. 'ఎప్పుడో ఇక్కడినుంచి వెళ్ళినవాడు మళ్ళీ వచ్చి, ఆ పొలాలుకొనట మేమిటి అంతధర పెట్టి? నిజానికి నేకొక్కడినే ఆయనకు అయినవాడిని దగ్గరి వాడిని. రక్తసంబంధీకుడిని ఆయన క్షేమంకోరేవాడిని. రోజుకొకసారివచ్చి 'ఎట్లా ఉన్నవ'ని అడిగేవాడిని. నన్ను సంప్రతించకుండా-నాతో ఒక్కమాట చెప్పకుండా అన్నదానాలూ విద్యాదానాలూచేసి డబ్బు పాడుచేస్తున్నాడు. ఊళ్ళో బావులు తవ్వించటం, రోడ్లు వేయించటం-డబ్బు ఇలా తగలెయ్యకపోతే అయినవాణ్ణి కనిపెట్టిచూడకూడదూ? ఇంకా కరెంటుదీపాలు పెట్టిస్తాడట-ఈ ఊరిని ఉద్ధరించ టానికి-నాకు ఇల్లు కప్పించుకుందామంటే చేతిలో పైసలేదు. ఒక్కనాడైనా "ఏమిరా! ఏమిటి నీ సంగతి? అంతా బాగున్నారా?" అని ఒక్కసారైనా అడిగాడా? కష్టం సుఖం చెప్పుకుందామంటే అవకాశమే ఇవ్వడాయె. ఎన్ని పనులుచేస్తేనేం? అయినవాళ్ళకు దూరమై అనాధచావు చస్తున్నాడు. అప్పుడు నేనేరావాలి తలకొరివి పెట్టటానికి" తలపట్టుకుని కూర్చున్నాడు దుఃఖపడుతున్న వాడిలా.

చనిపోయిన భార్యకు సవతి తమ్ముడు మనోహరం-అక్క ఉన్నన్నాళ్ళూ డబ్బుకోసం పీడించి తీసుకునేవాడు దొంగతనంగా కొంత తీసుకునేవాడు ఇంట్లో వస్తువులు ఎత్తుకుపోయి అమ్ముకునేవాడు. అక్క నగలు తీసుకుని సానివాడలు చేరేవాడు. సంజీవయ్య ఇప్పటిస్థితిచూసి "ఈయనకు నేను తప్ప ఎవరున్నారు? ఆస్తిఅంతా నాకురావలసిందే. ఇంకొకడికి పోనివ్వను. అసలు ఆయన ఒంటిమీద ఇంకొకరిని చెయ్యివెయ్యనిస్తానా?" అతడి మనసులో ఊహలు ఉబికి ఉబికి పైకి లేస్తున్నాయి.

పొలంపనులు చేసేవాళ్ళ గుసగుసలలో- "ఈ ఆసామి కచ్చితంగా పని చేయించుకుంటాడు. అంత కచ్చితంగానూ అడగకముందే డబ్బిచ్చేస్తాడు. తనకు ఎంత కావాలో ధాన్యం అంతే ఉంచుకుంటాడు. కొంత అన్నదానానికి ఉంచి మిగి లిన ధాన్యం అమ్మితాడు. ఆ డబ్బు ఊరిమీద ఖర్చుచేస్తాడు."

"ఇంత ఉన్నవాడు కదా. బట్టలయినా మంచివి వేసుకోడు. నేతపంచె- పొట్టిచేతుల చొక్కా-భుజమ్మీద తుండుగుడ్డ- నాటుచెప్పులు- ఇదీవేషం. ఆ పొలం

ఎంత మంచిది కాకపోతే అంత పంట వస్తుంది? అంతా ఆయన అదృష్టం. ఈ బంగారం పండే పొలం ఎవరిపాలబడుతుందో? మనమందరం తలా ఇంత వేసు కుని కొందామంటే- అబ్బో! వేలు కాదు లక్షలు కావాలి."

సంజీవయ్య ఇల్లు ఆ ఊరికి మణిదీపం లాంటిది. ఆ ఇంటికోసం ప్రత్యేక మయిన సరుకు తెచ్చి కొత్తరకంగా ఉండేటట్లే కట్టించాడు. గోడలూ నేల తళతళ లాడుతూ నీడలు కనబడేటట్టుంటాయి. ఎటుచూసినా ఒక కొత్త వింత. ఒక కొత్త సొగసు కనబడుతుంది. ఆ యింట్లో మేడమీద ఆయనొక్కడే ఉంటాడు. కింద మూడు నాలుగు శాఖలుగా బల్లలు వాటిముందు కుర్చీలు- గుమాస్తాలు కూర్చుని లెక్కలురాస్తూ ఉంటారు. అది ఒక ఆఫీసు మాదిరిగా ఉంటుంది. డ్రాయింగు రూమ్ అలంకరణ అపురూపంగా తీర్చిదిద్దాడు.

ఆయన ఆ లెక్కలు చూస్తూ గుమాస్తాలతో భవిష్యత్కార్యక్రమాలను గురించి చర్చిస్తాడు. ఏది అత్యవసరమో, ఏది ఎట్లాచేస్తే బాగుంటుందో ప్రణాళి కలు వేసి ఏటా ఇంతపని జరగాలని నిర్ణయిస్తాడు.

ఆ యింట్లో కిందిభాగంలో ఒకగదిలో నడీడు ఆడమనిషి ఉంటుంది. ఆమె ఇంటివ్యవహారాలు మొత్తం ఒక్కతే చక్కబెడుతుంది. ఆయన ఆహారవిహారాలు ఆమెస్వయంగాచూస్తుంది. తెలుసుకుంటుంది. ఆయనకు కావలసినట్టుగా వంట చేస్తుంది వేళమించనివ్వదు. ఆయనకు ఉదయం ఐదుగంటలకే నిమ్మరసం. తేనె, కాగి చల్లారిననీళ్ళలో కలిపిఇవ్వాలి. ఏడుగంటలుదాటిన తరువాత కాఫీమాత్రమే ఇవ్వాలి. పదకొండు గంటలకు భోజనం పెట్టాలి.

ఆయనకోసమే ఆమె పెరట్లో నిమ్మచెట్టువేసి రెండుపూటలా నీళ్లుపోస్తుంది. కాయలు కాయిస్తుంది.

ఆయన బావిదగ్గరే తోడుకున్న నీళ్ళతో స్నానంచేస్తాడు. ఆమె బట్టలు పట్టుకుని నిలబడుతుంది.

"నిమ్మచెట్టు ఒక్కటే వేశావు. అరటి కూడా వెయ్యాలి. అరటిపండు ఒంటికి మంచిది. పెరట్లో కాయించితే కొనక్కరలేదు" తనలో తను అనుకున్న ట్టుగా అన్నాడు.

ఆమె తనుచేసిన లోపానికి తలవంచుకుంది.

"చూడు. వచ్చేనెలనుంచీ నాకు మరొక గుమస్తా కావాలి. నీవు ఆ సీటు ఆక్రమిస్తావా ? పనిచేస్తే మనసు పదునెక్కుతుంది. ఏమంటావు?"

"సరే. మీమాట కెదురు చెప్పను."

అందుకే వ్యవహారమంతా పకడ్బందీగా ఉంది. ఎవరికీ అంతుపట్టటంలేదు. వేలు పెట్టటానికి వీలుగాలేదు.

ఎటూ ఆలోచన పోని కొందరు ఆమెకూ, సంజీవయ్యకూ సంబంధము అంటగట్టారు.

ఆయన చెవినకూడా పడిందీమాట.

ఏమిటీలోకం? మనుష్యులా-కాకులా?

ఆ పరిమళ వచ్చి ఆయన చేతులు పట్టుకుని ఏడ్చేవరకూ ఆయన అంతగా ఆ మాట పట్టించుకోలేదు.

ఆయనకు లోకం తెలుసు. ఆమెకు అనుభవం లేదు.

"ఎందుకమ్మా ఆ గాలివాటు మాటలు పట్టుకుని అంత తీవ్రంగా బాధపడతావు? నేను ఊరిని బాగుచేస్తున్నాను గాని మనుష్యులను బాగుచెయ్యటం ఇంకా మొదలుపెట్టలేదు. గాయపడిన నీ మనసును ఇంకా గాయపరచకు" లేచి ఆమె కన్నీళ్ళొత్తాడు.

సంజీవయ్యకు సుస్తీగా ఉన్నదని డాక్టరుకు కబురు తెలియగానే వచ్చి చూశాడు.

"మీరు ఎండలో తిరిగారా ఏమిటి ? వడగొట్టిన చిహ్నాలు కనబడుతున్నాయి" అన్నాడు పరీక్షచేసి.

"ఎక్కువగా తిరగలేదే? ఏదో మామూలుగా...."

"ఏప్రిల్ ఎండలు బాగా ముదిరాయి. కాని వారు మామూలుగా పదకొండు గంటలకు ఎండలో వెళ్ళివస్తారు. అదే ఇంతపని చేసింది" అన్నది పరిమళ.

"అలాగా? అయితే అడిగినప్పుడు కొబ్బరినీళ్ళు ఇస్తూఉండండి. అలసట

తగ్గిపోతుంది. ఇక్కడ దగ్గరలోనే వీరు టెలిఫోను పెట్టించారు. మీరీరాత్రికే ఫోనుచేస్తే నేను వస్తాను" డాక్టరు వెళ్ళిపోయాడు.

పరిమళ కొబ్బరిబొండాలు తెప్పించిపెట్టింది. ఆయన అడిగినప్పుడల్లా గ్లాసులోపోసి ఇస్తోంది. ఆ రాత్రికి డాక్టరుకి ఫోనుచేసింది. "అలాగే ఉన్నార"ని. వెంటనే ఆయన కారులోవచ్చి ఇంజక్షను ఇచ్చాడు.

"రాత్రికి బాగా నిద్రపోతారు. రేపుప్రొద్దున నేను మళ్ళీ వస్తాను భయం లేదు" అని చెప్పాడు.

తెల్లవారేసరికి ఊరంతా పోగయి రకరకాలుగా చర్చించుకున్నారు. సంజీవయ్యను చూసి జాలిపడ్డారు. ఆస్తి యెవరికి చెందుతుందోనని దిగాలుపడ్డారు. 'నాకు కాక ఇంకెవరికి' అని ఆశలు పెంచుకున్నారు.

అంతలో కారులో ఒక యువకుడు భార్యాబిడ్డలతో వచ్చాడు. సరాసరి లోపలికివచ్చి ఆయన మంచమ్మీద కూర్చుని "ఏమిటి నాన్నా! ఇలా పడుకున్నారు? నాకు నిన్నపొద్దున ఒదిన టెలిఫోను చేసింది- ఒకసారి వచ్చి చూసివెళ్ళండని. ఏమయింది?"

సంజీవయ్య కళ్ళుతెరిచి "ఏం కాలేదురా,కాస్త అలిసిపోయాను. అలా ఊరి చివరదాకా వెళ్ళి, అక్కడ పనిచూసుకుని వెనక్కుతిరిగాను. ఇంటికిరాగానే కాస్త అలసటనిపించింది, మీ ఒదినె వెంటనే డాక్టర్ని పిలిపించి హడావడి చేసింది.

కారులో వచ్చినతడు 'నాన్నా' అని పిలవగానే సాంబయ్య, మనోహరం దిగ్భ్రాంతులయ్యారు.

"మనకెందుకు వచ్చిన బాధ- ఏదో మహాత్ముడిలాంటి ఆయనకు సుస్తీ చేసిందని వచ్చాంగాని- మనకేంబట్టింది? కొడుకు కాబోలు- నాన్నా అంటూ వచ్చి మంచమ్మీద కూర్చున్నాడు. ఆయనకు కొడుకూ కోడలూ పిల్లలూ ఉన్నారు కాబోలు- మనకేం తెలుసు!" సాంబయ్య మనోహరం లేచి ఖండువా దులిపి మళ్ళీ వేసుకుని, వాకిట్లో విడిచిన చెప్పులు కాళ్ళకు తగిలించుకుని పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

అరగంటలోగా అందరూ ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళారు.

పరిమళ గది ఊడ్పించి తుడిపించి ఫోను పెట్టింది.

పదిగంటలయ్యే కారముందే డాక్టరు గ్లూకోజ్ ఎక్కించటానికి తగిన సామగ్రితో ఒక నర్సుతో వచ్చాడు.

సంజీవయ్య కొడుకును చూసి, ఆయనకు దగ్గరగా మంచమ్మీద కూర్చున్నాడంటే ఆత్మీయుడే అయిఉంటాడనుకున్నాడు డాక్టరు.

"సంజీవయ్యగారికి నీరసంగా ఉన్నట్లనిపిస్తే గ్లూకోజు ఇద్దామని వచ్చాను. నిన్న పరిమళగారు ఫోనుచేశారు. నేను ఇక్కడికి పాతికమైళ్ళ దూరంలో ఉంటున్న ప్రైవేటు ప్రాక్టీషనర్‌ని వారు నెలకొకసారి నన్ను పిలిపించి ఊరు ప్రజలందరికీ ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ ఉంటారు. నాలుగేసి రోజులు ఉండి చూస్తూఉంటాను" అని తనను పరిచయం చేసుకున్నాడు.

"అలాగా? అవసరమయితే గ్లూకోజు ఇవ్వండి. ఆయనకు మజ్జిగతేట, పలచటి రాగిగంజి, మధ్యాహ్నం వేళల్లో తాగే అలవాటు. అవి తీసుకుంటే మనిషి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉంటాడు. ప్రొద్దునా సాయంత్రం అలా కాస్త వాకింగ్‌చేస్తూ ఉంటాడు. ఖడ్డీ లాంటి శరీరం. క్రమం తప్పని అలవాట్లు ఆయనవి" అంటూ లేచాడు కొడుకు.

పరిమళ వేడివేడిగా కాఫీ టిఫిన్ తయారుచేసింది. భోజనాల యింట్లోకి తీసుకువెళ్ళి అందరికీ పెట్టింది. స్నానాలకు ఏర్పాట్లు చేసింది.

"నా టెలిఫోను అందగానే బయలుదేరినట్లున్నావు రాంబాబూ మామయ్యగారు చెప్పలేదు గాని నేనే చేశాను. నీవేం తొందర పనుల్లో లేవుకదా?" అంది.

"ఇప్పుడేం తొందరపనుల్లేవుగాని ఈ నెలాఖరునుంచీ చేతినిండా పని. పిల్లలూ రమ్య తొందరపెడుతున్నారు ఎటైనా నాలుగురోజులు వెళ్దామని. యింతలో నీ ఫోను వచ్చింది. ఈ సాకుతో బయలుదేరాము" అన్నాడు టిఫిన్ తీసుకుంటూ.

సరిగ్గా మధ్యాహ్నం పన్నెండుగంటలకు టాక్సీలో సింహా వచ్చాడు.

"నీకూ వేళకే సమాచారం అందిందా నాయనా!" యెదురుగా వచ్చింది పరిమళ.

"ఏడీ తాతయ్య? ఏ గదిలో ఉన్నాడు? కిందనా-పైననా?" కిందికీ పైకీ తిరిగి తాతయ్య గదిలో చేరుకున్నాడు.

"డాక్టర్. ఏమిటిది? ఎందుకీ గ్లూకోజ్ ?"

"ఎండకొట్టింది. నిన్నంతా మత్తుగా పడుకున్నారు. ఈమధ్య ఊరంతా వేళగాని వేళల్లో తిరగటం మొదలుపెట్టారు. అసలే బలహీనంగా ఉన్నారు. దానిలో- ఎండలు ముదిరాయి కదండీ. కొంచెం వడగొట్టినట్లయింది. అందుకని ఒక సీసా ఎక్కిద్దామని వచ్చాను."

అంతలోకి కళ్ళతో మనమణ్ణి ఆపాదమస్తకమూ ప్రేమతో తడిమినట్టుగా చూశాడు సంజీవయ్య.

సింహ ఆప్యాయంగా పలకరించినట్టు నవ్వి కుర్చీ మంచానికి దగ్గరగా కాళ్ళవైపు జరుపుకున్నాడు.

ఈలోపల రాంబాబు కుటుంబం ఊరంతా ఒకసారి చుట్టబెట్టి వచ్చింది. తనకు ప్రభుత్వంవారు అప్పగించినపని ప్రారంభించటానికి ఒకవారమే టైముంది. ఆఖరిరోజువరకూ తండ్రిదగ్గర కుటుంబసహితంగా ఉండి, వదినగారికి ధైర్యం చెప్పి, తండ్రిదగ్గరికి వచ్చాడు.

"నాన్నా, మరి నేను వెళ్ళిరానా? సింహ ఇంకా నాలుగురోజులు ఉంటానన్నాడు. నీవు తొందరగా ఆరోగ్యం బాగుచేసుకో. ఒదినకు ధైర్యంగా ఉంటుంది"

సంజీవయ్యకు మజ్జిగరసమూ, రాగిగంజీ వంటి తేలిక పదార్థాలు కొంచెం కొంచెంగా గడియారం చూసుకుంటూ రెండుగంటలకొకసారి ఇస్తున్నది. ఆయన మెల్లగా దిండ్లకానుకుని కూర్చొని మనమడితో కబుర్లు చెబుతున్నాడు.

"పరీక్షలెప్పుడూ?"

"మామూలుగా అయితే మార్చి చివరికి మొదలుపెట్టాలి. కాని- విద్యార్థులుగాని, ఉపాధ్యాయులుగాని స్ట్రైక్‌చేస్తే ఆగిపోవచ్చు. మళ్ళీ వాతావరణం బాగుపడే వరకూ పరీక్షలు తలపెట్టరు.

"ఎప్పుడైనా కానీ. ఈ పరీక్షలతో కోర్సు పూర్తిఅయిపోతుందా?"

"అవుతుంది. కాని- తాతయ్యా. నేను ఒక ఏడాదిపాటు అనుభవంగల పెద్ద డాక్టరు చేతిక్రింద పనిచేద్దామనుకుంటున్నాను. అదికూడా చదువులో ఒక భాగమే ననుకో. ఒకసారి ఆపితే మళ్ళీ అనుభవంకోసం ఇంకో ప్రయత్నం చెయ్యవలసి వస్తుంది. పరిస్థితులు ఇప్పుడు బాగానే ఉన్నాయి. కనుక ఆ పనికూడా పూర్తి చేసుకుని వస్తాను. సరేనా?" ఆయన ముఖంలోకి చూస్తూ అన్నాడు

"నీ మాట నిజమే. మొదలే అనుభవం సంపాదించుకుని తరువాతనే పని ప్రారంభించటంలో చాలా లాభం ఉంది. నీవు వెళ్ళేలోపల. మీ అమ్మా-నీవు కలిసి ఊరిబయట నేను మొదలుపెట్టిన పని బాగుందో లేదో చూసివచ్చి చెప్పండి. ఇంకా మార్పులూ చేర్పులూ అవసరమైతే ఇప్పుడే చెప్పాలి."

ఆ సాయంకాలం తల్లీకొడుకులు ఇద్దరూ ఆయన చెప్పినచోటికి వెళ్లారు.

ఒక ఎకరం భూమిలో పెద్దపెద్ద బిల్డింగులు పది అడుగుల కారిడార్‌తో కడుతున్నారు. పైకప్పు పడ్డది. ఇద్దరూ వాటిని లోపలివైపు కూడా తిరిగి-తిరిగి చూశారు

"వాటికి ప్లాన్లు ఎక్కడినుంచి వచ్చాయి?"

"తాతయ్యకు తెలియనివాళ్ళున్నారా? ఆమధ్య ఢిల్లీలో మెడికల్ కాన్ఫరెన్స్ జరిగింది చూడు. అప్పుడు తాతయ్య నాతోకూడా వచ్చారు. అది ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సు థొరాసిక్ సర్జరీపైన మాట్లాడటానికి ఇద్దరు సర్జన్లు—ఓపెన్‌హార్టు సర్జరీమీద మాట్లాడటానికి ఇద్దరూ వచ్చారు దేశ్‌ముఖ్‌గారు ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఉండగా రెండు కాన్ఫరెన్సులు ఒక్కసారి జరుపుకోవటానికి వీలుగా పెద్దపెద్ద హాల్సు రెండు కట్టించారు. ఒక పెద్ద హాలు విడిగా వాటికి ఆనుకునే ఉంది లంచ్ పార్టీలకు, ఆ వచ్చిన డాక్టర్లలో ఒక సర్జను మీ తాతగారికి పరిచయస్తుడు. మీ తాతగారడిగితే ఆదేశంవెళ్ళి ఈ ప్లానులు గైనకాలజీకి ఒకటి, సర్జరీకి ఒకటి పంపించాడు. భవనాలు పూర్తిఅయితే పంకరాలు కూడా అక్కడినుంచే వస్తాయట- తాతయ్య చెప్పారు. స్టాఫ్‌కి పత్రికాప్రకటనలు చేస్తారట. కుంత ఫర్నీచర్ బెంచీలు, స్టూల్సు వంటివి ఇక్కడే చేయిస్తారట. కొన్ని బొంబాయినుంచి తెప్పిస్తారట."

"అసిస్టెంట్ డాక్టర్లు రెండు శాఖలకూ కావాలి. మత్తుమందిచ్చే డాక్టర్లు

కూడా ఉండాలి హాస్పిటల్లో రెండుశాఖలు పెట్టటమంటే మాటలుకాదు. మరి తాతయ్య ఏమనుకుంటున్నారో? అంత డబ్బు ఖర్చుచేసి స్థాపిస్తున్న వైద్యాలయా లకు రోగులు రావాలి. అందులో ఇది పల్లెటూరు" సింహ ఆలోచనకు అందటం లేదు తాతగారు వేసిన పథకం.

"పల్లెటూళ్లలోనే పెద్దపెద్దహాస్పిటల్సు ఉంటాయట విదేశాలల్లో. పట్టణాల నుంచీ, నగరాలనుంచీ వస్తారట రోగులు" అన్నది పరిమళ.

"అమ్మో, రోగులు వస్తారు సరే. వాళ్ళవెంట వచ్చేవాళ్ళకు వసతిగృహాలు ఉండాలి. పెద్ద కాంటీన్లు ఉండాలి. యివన్నీ నిర్వహించటం కష్టం కదూ?''

"ఈ బిల్డింగులు తయారవుతుంటే డబ్బుగల సేట్లు ముందుకువచ్చి, చుట్టు పక్కల స్థలాలను బేరాలు చేస్తున్నారు. వాళ్ళకు మీ తాతయ్యే సలహాదారు.

"ఇప్పుడంతా ఒక కలగా ఉంది నాకు. ఈకల నిజంకావాలి. ఇది విజయ వంతంగా నడిస్తే మన ప్రాంతంలో ఇదొక గొప్ప వైద్యాలయమవుతుంది. దీనికి ధైర్యం, సాహసం కావాలి."

"తాతయ్య ప్లానింగ్ సెక్రెటరీగా రిటైరయ్యారు కదా. శతవిధాల విజయ వంతం కావచ్చు. దీనికి పేరుకూడా నిశ్చయించారు."

"అప్పుడే? ఏమిటట?" విస్మయంతో చూశాడు సింహ.

"మీ నాన్నగారి పేరుతో ఈ వైద్యాలయం చిరస్థాయిగా నడవాలట. 'దనుంజయ వైద్యాలయం' దీని పేరు" ఆమె కళ్ళు చెరువులయ్యాయి.

ఈ పేరు విన్నతరువాత వాళ్ళిద్దరిమధ్య మాటలు సాగలేదు. మౌనంగా ఒకరి వెనుక ఒకరు ఇల్లు చేరుకున్నారు.

అప్పటికి తాతయ్య లేచి కూర్చుని ఇద్దరు పెద్దమనుష్యులతో మాట్లాడు తున్నాడు. అదికూడా వ్యవహారానికి సంబంధించినదే. అయినా మధ్య మధ్య నవ్వులూ, పరాచికాలు.

సంజీవయ్య ముఖం తేటగా ఉండటం చూసి ఇద్దరూ సంతోషించారు.

ఆ మూడవరోజున- 'తాతయ్యా. నీవు మామూలుమనిషివయ్యావు. అయినా

ఎక్కువ తిరగకు. ఏదయినా పని ఉంటే అమ్మచేత చేయించు. నేను రేపటికి టికెట్ కొనుక్కోనా?" దగ్గర కూర్చుని అడిగాడు.

"వెళ్తావా సింహా? మీరిద్దరూ వెళ్ళి చూసివచ్చారే- వాటిగురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"ఆ ప్రణాళిక మా దృష్టికి అందటంలేదు. మేమింకా అంత ఎత్తుకు ఎదగలేదు తాతయ్యా."

"నా కలలు పండిననాడు మీకర్థమవుతుంది. నా ప్రణాళికను గురించి. మతకలహాలలో ఆర్మీడాక్టరుగా చనిపోయిన నా కొడుకు 'ధనుంజయ' దేశవ్యాప్తంగా రోగులకు సేవచేస్తాడు. మీరిద్దరు వాడి ఏజంట్లనుకోండి. మీరిద్దరూ సహకరిస్తే నా ప్రణాళిక విజయవంతమవుతుంది. ఉన్నవాడిదగ్గర డబ్బువసూలు చెయ్యాలి. లేనివాడికి మాధవసేవ చేస్తున్నామనుకోవాలి. ఇదే నా ధ్యేయం. నా ధనుంజయ అటువంటి వాడురా. వాడి ఆదర్శాన్ని మీరిద్దరూ మరువకూడదు, నాకు ఆశాభంగం కలుగకూడదు. ఏం పరిమళా? నాతో ఏకీభవిస్తావా?'' ఆయన కళ్ళనిండా నీళ్ళు.

పరిమళా సింహా కన్నీటితో ఆయన పాదాలు కడిగారు.

"తాతయ్యా నేనుకూడా" అంటూ తాతయ్యను చుట్టివేశాడు తన చేతులతో సింహ.

సంజీవయ్య ఒక నెలరోజులు డాక్టరు సలహా ప్రకారం నడుచుకున్నాడు. అటుతర్వాత తన ఎప్పటి కార్యక్రమాలు ప్రారంభించాడు. భవనాలు పూర్తి కాగానే చుట్టుపక్కల స్థలమంతా శుభ్రంచేసి రెండు బిల్డింగుల ముందర ప్రహరీ గోడకు దగ్గరగా పూలచెట్లు వేయించాడు. ముందు ఖాళీస్థలం కార్లకూ, బండ్లకూ వదిలిపెట్టాడు. విదేశాలనుంచి వైద్యాలయానికి కావలసిన పరికరాలూ, వాటిని అమర్చేవారూ వచ్చారు. వాటి అమరిక అయినతరువాత విదేశాలనుంచి ఆయా శాఖలకు సంబంధించిన డాక్టర్లు వచ్చి పరిశీలించారు.

దానికి ప్రారంభోత్సవం జరగబోతోందని పత్రికలన్నిటిలో ప్రకటనలు చేయించాడు సంజీవయ్య. పెద్ద ఆర్భాటం లేకుండా విదేశాలనుంచి వచ్చినడాక్టర్లు ప్రారంభోత్సవం చేశారు. ఆ ఊరిలో కూడా సహృదయులైన పెద్దలు, సంజీ

వయ్యకు ఆత్మీయులైనవారు సభలో మాట్లాడారు. ప్రారంభోత్సవానికి ముందే ధనుంజయ ఫోటోలకు పూలహారాలు విదేశీ డాక్టర్లచేత వేయించారు. దానిలో పని చేయబోయే డాక్టరు పరిమళ, డాక్టరు సింహ అందరికీ పరిచయం చేయబడ్డారు.

డా॥ సింహ మాట్లాడుతూ క్రమక్రమంగా నేత్రవైద్యమూ, దంతవైద్యమూ కొరకు శాఖలు పెట్టబోతున్నామన్నట్టుగా చెప్పాడు.

ఆహూతులందరికీ అల్పాహార విందు జరిగింది.

ఆ మరునాటినుంచే రెండు వైద్యాలయాలూ నడవటం ప్రారంభించాయి. కొత్తగా సెలక్టయిన అసిస్టెంటు డాక్టర్లు, నర్సులు, తోటీలు, ఆయాలు అల్పాహార విందయిన తరువాత తమతమ శాఖలను చూసుకుని వచ్చారు కనుక బాగా అలవాటున్నట్టుగా వారివారి పనులందుకున్నారు.

సంజీవయ్య చూస్తూఉండగానే ఆనాటినుండీ చిన్నా పెద్దా కేసులతో ఆ ఊరి జనమే కాకుండా దూరపుగ్రామాలనుంచీ రోగులు రావటం ప్రారంభించారు. ఆయనకు ఆప్తులయిన బంధువులూ, సరిపడని బంధువర్గమూ కూడా వస్తూనే ఉన్నారు.

సంజీవయ్య ఆశయం ప్రకారం పేదవారికి ఉచిత వైద్యం జరుగుతున్నది.

అప్పటి భారత ఉపాధ్యక్షుడు తన స్వగ్రామం చూసుకోవటానికి బయలు దేరబోతున్నాడన్న వార్త వినగానే సంజీవయ్య ముందుగా తమ గ్రామానికి వచ్చి వైద్యాలయాలను చూసివెళ్ళమని ఆహ్వానించాడు.

ఉపాధ్యక్షుడు వస్తాడని పురమంతా అలంకారాలు ఊరివారే చేశారు. ఉపాధ్యక్షుడిని సంజీవయ్య, డా. సింహ, డా. పరిమళ స్వయంగా తమ కారులో బయలుదేరి సగౌరవంగా తీసుకువచ్చారు.

ఆయన వైద్యాలయాలు పరిశీలించి సభలో ప్రసంగిస్తూ "గ్రామాలలో ఇటువంటి వైద్యాలయాలు నిర్మింపబడితే గ్రామాలేకాదు, పట్టణాలూ బాగుపడ తాయి. ప్రతి పౌరుడికీ వైద్యము సమయానికి అందుబాటులో ఉంటుంది. ఈ విధంగా మనదేశంలోని గ్రామాలన్నీ అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నా" నని అన్నారు.

ఆ రాత్రి జరిగిన విందులో "సంజీవయ్యగారూ ! నేను మంత్రిగా ఉన్నప్పటినుంచీ మీరు ప్రణాళికా శాఖకు కార్యదర్శిగానే ఉంటూ దక్షతతో మీ బాధ్యతను నిర్వహిస్తూ వచ్చారు- కాని మరొక శాఖలో మీరు పనిచెయ్యలేదు. నామాట రైటేనా?" అన్నాడు.

"మీకు ప్రధాని దగ్గరనుంచి మంత్రులవరకూ, అన్ని శాఖల కార్యదర్శులను గురించీ తెలుసు. రాజకీయాలు బాగా వంటపట్టించుకున్నవారే గాని వాటికి కొత్తవారు కారు. మీరు రాజకీయాలలోకి దిగుతారనే ఆశించాము అందరమూ. కాని మీరు ఈ రంగాన్ని ఎన్నుకోవటం ఒక విశేషమే" అన్నాడు.

"అవును. అందరికీ ఆశ్చర్యం కలిగింది కూడాను. నాకు మీరన్నట్టుగా అందరూ తెలిసినవారే. కోరితే ఏదో పదవి ఇవ్వకపోరు. నాకు వార్తలు కూడా అందాయి. కొందరు రాయబారాలు కూడా నడిపారు. కాని స్వభావరీత్యా నేను రాజకీయాలలో ప్రవేశిస్తే జయించుకురాలేను. నాకదొక బలహీనత. పెద్దలిచ్చిన ఆస్తి అంతా అమ్మి ఈకార్యక్రమానికి పూనుకున్నాను. నేను ఢిల్లీవచ్చి మీ దర్శనం చేసుకుంటాను. నాకు మరొక ఎకరం భూమి కేన్సర్ ఇన్స్టిట్యూట్కూ, రేడియాలజీ శాఖకూ అవసరముంది. వాటికి ప్రభుత్వ సహాయాన్ని అర్థిద్దామనుకుంటున్నాను. ఇక్కడి పేదవారు నగరాలకు వచ్చి నెలల పర్యంతం ఉండి వైద్యం చేయించుకోలేరుకదా. నాకీసేవలోనే దైవము కనిపిస్తున్నాడు. ఈ జీవితమే నాకు సుఖంగా ఉంది" అన్నాడు చేతులు జోడించి.

"మీ మాట నిజమే. అందరూ రాజకీయాలలో జొరబడి ఉపన్యాసాలుఇచ్చి ఆశయాలను వెల్లడించటమే కాని కృషి జరుగుతుందా? మీరు ఎన్నుకున్న రంగం చాలా ఆదర్శవంతమైనది దేశాన్ని బాగుచెయగలిగిన బాట. మిమ్మల్ని అభినందించకుండా ఉండలేకపోతున్నాను" అన్నారు ఉపాధ్యక్షులు

'అందరూ ఇట్లా ఉంటే? దేశం బాగుపడటం ఒక దశాబ్దంలోనే చూడగల్గుతాము' అనుకున్నారు మనసులో.

వారిని సంజీవయ్య కుటుంబం విమానాశ్రయం వరకూ సాగనంపింది.

ఆ రాత్రి సంజీవయ్య మనసు తృప్తిచెందింది. ఆనంద పారవశ్యంలో నిద్ర రాలేదు. ఉపాధ్యక్షుడి మాటలు పదే పదే జ్ఞాపకం రాసాగాయి తన అందరి జాత

కాలూ తెలుసు. రాజకీయాలలో ఒడుపు. కృత్రిమ వినయవిధేయతలూ డాబూ దర్పం ఉంటేగాని నిలవలేరు. అవసరమయితే కాళ్ళుపట్టుకోవాలి. అందితే చెపులు పట్టుకోవాలి. తనకా రెండిటిలోనూ నైపుణ్యం లేదు. అందుకే సెక్రటరీగానే ఉండి పోయాడు. అది అందరికీ ఆశ్చర్యమనిపించింది కాని తనకు సంతోషమనిపించింది. ఇది చాలు మానవుడిగా పుట్టినందుకు మానవత్వాన్ని నిలుపుకోవటానికి,

ఎప్పటికో వేకువజామున కళ్ళు మూతలుపడ్డాయి.

అధికప్రయాసలో కేంద్రప్రభుత్వానికి పెట్టుకున్న దరఖాస్తులు సఫలీకృతం కావటానికి ఐదు సంవత్సరాలు పట్టింది. భవనాలకు రిజర్వుబ్యాంకు సహకరించింది. ఆ రెండింటికీ ప్రారంభోత్సవం చేయటానికి రిజర్వుబ్యాంకు గవర్నరే స్వయంగా వచ్చాడు.

ఆయన అమరునాడు వస్తారనగా విమానాశ్రయానికి డా॥ సింహా, డా॥ పరిమళ వెళ్ళి తీసుకువచ్చేలోగా సంజీవయ్య అవసరమయిన యేర్పాట్లన్నీ చేయించాడు.

పేరు ఇంకా నిశ్చయం కాలేదు. తాత్కాలికంగా 'కేన్సర్ సెంటర్, రేడియాలజీ డిపార్టుమెంటు' అని బోర్డు పెట్టారు. వాటి ఆవిష్కరణకు ఆహ్వానించబడిన గవర్నరు ఆ భాగాలనూ, వాటిపక్కగా అంతకుముందుకట్టిన రెండు వైద్యాలయాలనూ చూసి చాలా సంతోషించాడు శ్లాఘించాడు. శ్రీ సంజీవి తన సహాధ్యాయనీ అతడితో ఐ.సి.యస్ అయినవాడు ఆఖరికి ఆయన ఆదర్శాలను ప్రశంసిస్తూ తన ఆనందాన్నీ, హర్షాన్నీ వెలిబుచ్చాడు.

గవర్నరు అన్నట్టుగా శ్రీ సంజీవి మేధస్సంపత్తి అమోఘము. భావనాపటిమ అద్వితీయము. తలలుతీసి మార్చగల ఘనుల చేతిక్రింద మాటపడకుండా పనిచేసినవాడు. మాటలతో కాక, చేతలతో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నవాడు. ఆయన కార్యనిర్వహణను అర్థంచేసుకోగల అధికారులు చాలా తక్కువమంది. ఆయన తన ఉద్యోగానికి రాజీనామా ఇవ్వకుండా సర్వీసు ఉన్నంత కాలమూ పనిచేసిఉంటే దేశభవిష్యత్తు మరొకవిధంగా ఉండేదని చాలా కొద్దిమందికి తెలుసు. చివరిదశలో ఆయన పనిలోనుంచి వైదొలగటం దేశంయొక్క దుర

దృష్టమే కాని మరియొకటి కాదు. ఆ విషయంయొక్క లోతుపాతులన్నీ సహాధ్యాయిగా రిజర్వుబ్యాంకు గవర్నరుకు తెలుసు.

సర్వీసులోనుంచి విడుదలయినతర్వాత శ్రీ సంజీవి తన వేషం పూర్తిగా మార్చివేశాడు. భారతదేశంలోని సర్వసామాన్యుడి వేషధారణ అవలంబించాడు. దేశంలోని అనారోగ్యాన్ని ముఖ్యంగా తొలగించాలనుకున్నాడు. ఆ కార్యక్రమాలకు తగిన పథకాలను వేశాడు. కృతకృత్యుడయ్యాడు.

గవర్నరును విమానాశ్రయంలో దింపి తిరిగివచ్చిన డా॥ పరిమళ, డా॥ సింహలకు, శ్రీ సంజీవికి ఇద్దరు.డాక్టర్ల సమక్షంలో ఆక్సిజన్ ఎక్కిస్తుండటం కనబడ్డది. ఆ దృశ్యం వాళ్లను దిగ్భ్రాంతులను చేసింది

"ఇంతలోకి ఏమయింది డాక్టర్?'' ఇద్దరూ ఆందోళనతో నిలబడిపోయారు.

ఒక పావుగంటయినా కాకముందే ఆక్సిజను ఎక్కించే గొట్టాలను డాక్టరు తీసేశాడు.

"కేన్సర్ సెంటరంతా రెండుసార్లు తిరిగిచూశారు. మమ్మల్నందరినీ పిలిచి "ఎలాఉంది? మీకందరికీ నచ్చిందా? మీరందరు నిజాయితీతో పనిచేసి దీనిపేరు సార్థకం చెయ్యండి" అంటూ కుర్చీలో కూర్చున్నారు. అప్పటికే ఒళ్ళంతా చెమటలు పోశాయి. కుర్చీలో ఒరిగిపోయారు. వెంటనే స్ట్రెచర్‌మీద తీసుకెళ్ళిఆక్సిజన్ ఎక్కించటం మొదలుపెట్టాము. కాని మా ప్రయత్నం ఫలించలేదు." డాక్టర్లిద్దరు వచ్చి సింహ చేతులు పట్టుకున్నారు.

"మేమెట్లా దీనిని నిర్వహిస్తామో చూడకుండానే వెళ్ళిపోయావా తాతయ్యా" సింహ ఆయన గుండెమీద తలవాల్చాడు కన్నీరు కారుస్తూ.

'భర్త పోయినప్పటినుంచీ నన్ను కూతురిగా చూసుకుంటూ కడుపులోపెట్టుకుని కాపాడారు తండ్రిమాదిరిగా. ఈ తండ్రి ఆత్మీయతను జన్మ జన్మలకూ మరువలేను" పరిమళ ఆయన పాదాలమీద పడిపోయింది.

ఆ వైద్యాలయాలలోని డాక్టర్లూ, పనివాళ్ళూ కన్నీటితో ఆయన దేహాన్ని పూలహారాలతో కప్పివేశారు.

ఎర్రటి కళ్ళతో సింహ అంతకుముందు తగిలించిన బోర్డులను తీసివేసి

సంజీవీ కేన్సర్ సెంటర్ అండ్ రేడియాలజీ డిపార్టుమెంటు అని చెక్కమీద రాసి గేటుమీద పెట్టాడు.

"అమ్మా, కన్నీళ్ళు తుడుచుకుని తాతయ్య పేరురాసిన బోర్డు చూడు. మనిద్దరి జీవితాలూ ఈ వైద్యాలయాలకు అంకితంచేసి తాతయ్య ఆశయాలను సఫలీకృతం చెయ్యాలి" అంటూ తల్లిని కౌగిలించుకుని బావురుమన్నాడు.

